

క్రీడాకారుల కల సాకారం

మహబూబ్‌నగర్‌లో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం పనులు తుది దశకు చేరాయి.

వివరాలు 8లో ▸



జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని పీజేపీ అధికారులు తెలిపారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.3 /22.1

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అప్పుడప్పుడు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శాంతియుతంగా నిమజ్జనం నిర్వహించాలి

జడ్చర్ల: పట్టణంలో శనివారం గణేశ్ నిమజ్జనోత్సవం శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ నరసింహ తెలిపారు. గురువారం ఆయన నాగసాల గ్రామ సమీపంలో గణనాథులను నిమజ్జనం చేసే చెరువును పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా చెరువు వద్ద సరైన లైటింగ్, క్రేన్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండపాల నుంచి విగ్రహాలను తరలించే సమయంలో విద్యుత్ లైన్ల వద్ద సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్పీ వెంట మున్సిపల్ కమిషనర్ షేక్, సీఐ రమేశ్‌బాబు తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



అడ్డాకుల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌ఓ కృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు ఇతర రికార్డులను పరిశీలించారు. ల్యాబ్‌ను తనిఖీ చేశారు. బీపీ చెక్ చేసే విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. జ్వరం, డెంగీ కేసులపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ భాస్కర్, ఫార్మసిస్ట్ కిరణ్, ల్యాబ్ టెక్నిషియన్ గోపాల్, సిబ్బంది భాగ్యలక్ష్మి, స్వాతి పాల్గొన్నారు.

గ్రంథాలయాలను తీర్చిదిద్దుతాం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలోని గ్రంథాలయాలను అన్నివిధాలా అభివృద్ధి చేసి కొత్త శోభ తీసుకొస్తామని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. గురువారం జిల్లా గ్రంథాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే పలు గ్రంథాలయాలకు కొత్త భవనాలు నిర్మించినట్లు తెలిపారు. మరో రెండు కొత్త భవనాలు నిర్మించేందుకు ఆమోదం లభించిందన్నారు. కోయిల్‌కొండకు రూ.60లక్షలు, హన్వాడకు రూ.68లక్షలు కేటాయించినట్లు తెలిపారు. జిల్లా గ్రంథాలయంలో పిల్లలు, మహిళల కోసం ప్రత్యేక షెడ్, తాగునీటి వసతికి బోరు బావి ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.లక్ష, పుస్తకాల కొనుగోలుకు రూ.20లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. పౌర పఠన మందిరాల నిర్వహణకు తీర్మానించామని, ఇందుకు రూ.1.50లక్షలు కేటాయించనున్నట్లు తెలిపారు. వెన్నాచేడ్ గ్రంథాలయంలోని నాలుగు దుకాణాలకు టెండర్ వేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో గ్రంథాలయ కార్యదర్శి మనోజ్‌కుమార్, శ్యాంసుందర్, మసియొద్దీన్, అనిత, మహ్మద్‌న్యూమన్ ఉన్నారు.

ఓటరు నమోదుపై అలసత్వం వద్దు



కోయిల్‌కొండ: ఓటరు నమోదు ప్రక్రియపై అలసత్వం వహించవద్దని నారాయణపేట అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. రాబోయే ఎన్నికలకు సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భరత్ పాల్గొన్నారు.

29న వనపర్తికి మంత్రి కేటీఆర్ రాక

వనపర్తి: రాష్ట్ర ఐటీ, పురపాలిక శాఖ మంత్రి కేటీఆర్ ఈ నెల 29న జిల్లాకు వస్తున్నట్లు మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. భగీరథ నీటి సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని, బుగ్గపల్లితండా నుంచి మిషన్ భగీరథ ప్లాంట్ వరకు రహదారి నిర్మాణం, జిల్లాకేంద్రంలో ఇంటర్ లింక్స్ వెంటనే పూర్తి చేయాలన్నారు. చింతల హనుమాన్ రహదారి, గాంధీచౌక్ నుంచి రామాటాకీస్ వరకు చిన్న చిన్న రహదారి మరమ్మతులు చేపట్టాలని సూచించారు.



తెలంగాణ చౌరస్తాలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న టీఆర్టీ అభ్యర్థులు

టీచర్ పోస్టులు పెంచాల్సిందే..

- తక్కువ పోస్టులు కేటాయించడంపై నిరుద్యోగుల్లో అసంతృప్తి
- ఉమ్మడి జిల్లాలో కేవలం 586 పోస్టుల భర్తీకి అనుమతి
- దరఖాస్తు ఫీజు తగ్గించాలని డిమాండ్
- మహబూబ్‌నగర్‌లో అభ్యర్థుల ఆందోళన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఏళ్ల తరబడి నిరుద్యోగులు ఎదురుచూస్తుండగా.. ఎట్టకేలకు ప్రభుత్వం టీఆర్‌టీ నోటిఫికేషన్ విడుదల చేసింది. కానీ.. ఆ ఆనందం నిరుద్యోగుల్లో ఎక్కువ సేపు నిలవలేదు. వేలల్లో అభ్యర్థులు ఉండగా.. ప్రభుత్వం మాత్రం చాలా తక్కువ సంఖ్యలో పోస్టుల భర్తీకి అనుమతి ఇవ్వడమే ఇందుకు కారణం. దీంతో పోస్టులు పెంచాలని.. అలాగే, టీఆర్టీ దరఖాస్తు ఫీజును తగ్గించాలని ఆందోళన బాట పట్టారు. గురువారం మహబూబ్‌నగర్‌లో అభ్యర్థులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఇదిలా ఉండగా, టీఆర్టీ నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో ఈనెల 20 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. పోస్టుల భర్తీలో భాగంగా ఈనెల 15న టెట్‌ను నిర్వహించారు. అలాగే, టీఆర్టీ కోసం దరఖాస్తు తేదీ నుంచి 60 రోజుల్లో అంటే నవంబర్ 20వ తేదీ ఆ మధ్యలో పరీక్షలు సైతం నిర్వహించనున్నారు.

13వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలి

ఉమ్మడి జిల్లాలో పోస్టులు 586 ఉండి జిల్లాల వారీగా తక్కువ పోస్టులు ఉన్నాయి. పోస్టులు సబ్జెక్టులు, కేటగిరీలు, కేడర్‌ల వారీగా చూస్తే ఒక్కో పోస్టు కూడా ఉండడం లేదని పలువురు అభ్యర్థులు పేర్కొంటున్నారు. రిజర్వేషన్ టేబుల్‌లో పోస్టుల సంఖ్య కంటే సున్నాలే ఎక్కువగా ఉన్నాయన్నారు. ఎన్నో ఏళ్లుగా డీఎస్సీ వేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటి నుంచి అన్ని వదులుకుని టీఆర్టీకి సిద్ధమవుతున్నామని, కానీ ప్రభుత్వం చాలీచాలని పోస్టులు ఇవ్వడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుందని వెంటనే పోస్టులు పెంచాలన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన విధంగా 13వేలకు పైగా పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఏ పరీక్షకు లేని విధంగా ఫీజులు ఏకంగా రూ.వెయ్యి పెట్టారని, నిరుద్యోగులు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారని ఫీజులు వెంటనే రూ.200లకు తగ్గించాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం

మహబూబ్‌నగర్‌లో 415 పోస్టులు, నాగర్‌కర్నూల్‌లో 450, నారాయణపేటలో అత్యధికంగా 470 పోస్టులు ఉన్నాయి. ఇక గద్వాల, వనపర్తిలో 316 పోస్టుల చొప్పున ఖాళీలు ఉన్నాయి. ఇలా వీటిలో 30శాతం పోస్టులు ప్రమోషన్‌లకు వదిలేసినా.. ఉమ్మడి జిల్లాలో దాదాపు 1400 పోస్టులు నేరుగా భర్తీ చేయాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం పోస్టులను భర్తీ చేయడమే తక్కువ భర్తీ చేస్తున్నట్లు పలువురు అభ్యర్థులు పేర్కొంటున్నారు. చాలా మంది అభ్యర్థులు గత సంవత్సరం నుంచి డీఎస్సీ పడుతుందనే భావనలో ఉద్యోగాల కోసం సిద్ధం అవుతున్నారు. మధ్యలో గురుకుల పోస్టులు పడినప్పటికి అందులో దాదాపు 80శాతం పోస్టులు కేవలం మహిళలకే కేటాయించడంతో పురుష అభ్యర్థులు మాత్రం అన్ని ఆశలు డీఎస్సీ మీదనే పెట్టుకున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో ఎన్ని పోస్టులకు ప్రమోషన్లు ఇస్తున్నారనే అంశంపై ప్రభుత్వానికి స్పష్టత ఉంది. మిగిలిన పోస్టులను పెంచాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.



మెట్టుగడ్డ వద్ద ర్యాలీగా వెళ్తున్న టీఆర్టీ అభ్యర్థులు

పోస్టులు పెంచాలి



కొన్ని నెలలుగా టీఆర్టీ కోసం సిద్ధమవుతున్నాం. కానీ ప్రభుత్వం గతంలో ప్రకటించిన పోస్టుల కన్నా తక్కువ పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చింది. ఎక్కువ మంది పోటీ పడుతున్నారు. ఎంతో కాలంగా ఆశగా చదువుతున్నాం. ప్రభుత్వం దీన్ని దృష్టిలో ఉంచుకుని పోస్టులు పెంచితే బాగుంటుంది. – అనూష, టీఆర్టీ అభ్యర్థి

తక్కువ పోస్టులతో ఇబ్బంది



వాస్తవంగా బడుల్లో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేస్తే పోస్టుల సంఖ్య పెరుగుతుంది. కానీ తక్కువ పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే వీటిలో ఒక్కో పోస్టుకు వందల సంఖ్యలో పోటీ పడాల్సి వస్తోంది. కేటగిరిలు, సబ్జెక్టు వారీగా చూస్తే కొన్ని సున్నా పోస్టులు ఉన్నాయి. ఎంతో ఖర్చులు భరిస్తూ చదువుతున్నాం. దీన్ని దృష్టిలో పెట్టుకొని వెంటనే పోస్టులను పెంచాలి. – మేఘమాల, టీఆర్టీ అభ్యర్థి

ఫీజు తగ్గించి..



ప్రభుత్వం ప్రస్తుతం తక్కువ పోస్టులతో మినీ డీఎస్సీ వేసింది. అసెంబ్లీలో ప్రకటించిన విధంగా పోస్టుల సంఖ్య పెంచి మెగా డీఎస్సీని నిర్వహించాలి. ఏళ్ల తరబడి పోటీ పరీక్షలకు రూ.లక్షల్లో ఖర్చులు భరించి చదువుతున్నాం. ప్రభుత్వం స్పందించి పోస్టులు పెంచాలి. అలాగే పరీక్ష ఫీజు కూడా రూ.200కి తగ్గించాలి. – కేశవులు, టీఆర్టీ అభ్యర్థి

అభ్యర్థుల నిరసన ర్యాలీ..

టీఆర్టీలో పోస్టులు తక్కువగా ఉండడాన్ని వ్యతిరేకిస్తూ జిల్లాలో పలువురు టీఆర్టీ అభ్యర్థులు నిరసన బాట పట్టారు. జిల్లాకేంద్రంలోని మెట్టుగడ్డ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టి 'మినీ డీఎస్సీ వద్దు, మెగా డీఎస్సీ వేయాలి' అని నినదించారు. అనంతరం తెలంగాణ చౌరస్తాలో బైఠాయించి నిరసన చేపట్టారు. ఈమేరకు టీఆర్టీ అభ్యర్థుల నిరసనకు కాంగ్రెస్ నాయకుడు హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీతో పాటు పలు సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో టెట్‌కు రెండు పేపర్లు కలిపి దరఖాస్తులు చేసుకున్న వారు 80 వేలకు పైగా ఉండడంతో ఒక్కో పోస్టుకు 140 నుంచి 150 మధ్య పోటీ ఉండే అవకాశం ఉందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉమ్మడి జిల్లాలో కేటగిరి వారీగా ఉపాధ్యాయ పోస్టులు

జిల్లా	ఓసీ	ఎస్టీ	బీసీ	ఎస్సీ	పీహెచ్‌సీ	ఈడబ్ల్యూస్	ఇతర పోస్టులు	మొత్తం
మహబూబ్‌నగర్	37	7	20	19	6	5	2	96
గద్వాల	58	8	30	30	9	8	3	146
నాగర్‌కర్నూల్	40	8	26	25	7	5	3	114
నారాయణపేట	57	10	36	27	13	8	3	154
వనపర్తి	35	4	12	16	5	2	2	76

అవగాహన లేకపోవడంతోనే సమస్యలు

- జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి

హన్వాడ: అవగాహనరాహిత్యంతోనే గ్రామాల్లో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గమనించి సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి అన్నారు. గురువారం హన్వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ నేరాలను అదుపు చేయడంలో భాగంగా చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ చట్టపరిధిలో నడుచుకోవాలని సూచించారు. చిన్న పిల్లలు వాహనాలను నడపొద్దని, పిల్లలకు వాహనాలు ఇచ్చినవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ప్రేమ పేరుతో ఎవరైనా వేధిస్తే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని, 100కు డయల్ చేసి సమాచారం ఇస్తే పోలీసులు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. గొప్ప లక్ష్యాన్ని పెట్టుకొని పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. గ్రామాల్లో చిన్నచిన్న గొడవలను పెద్దవిగా చేసుకోవడంతో పాటు కేసులు పెట్టుకొని ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాజీ మార్గంలో తమ సమస్యలను పరిష్కరించుకునే వెసులుబాటును జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కల్పిస్తుందనే విషయాన్ని తల్లిదండ్రులకు సూచించాలని అన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జడ్జి సంధ్యారాణి నమోదవుతున్న ఓపీ కేసులు, అందిస్తున్న వైద్య సేవలు, మందులు తదితర వివరాలు పీహెచ్‌సీ డాక్టర్ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు.

■ స్వేచ్ఛగా ఓటు వేసేందుకు ఈసీ కల్పిస్తున్న సౌకర్యాలను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని జడ్జి సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో మోడల్ బ్యాలెట్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. అనంతరం భూసమస్యలు, ధరణి పరిష్కార మార్గాలపై తీసుకుంటున్న చర్యలను తహసీల్దార్ కృష్ణానాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సల్ చీఫ్ రఘుపతి, ఎంపీపీ బాల్‌రాజ్, ఎంపీడీఓ ధనుంజయగౌడ్, మెడికల్ ఆఫీసర్ ప్రగతి, న్యాయవాది రాజేశ్, ప్రిన్సిపాల్స్ యోగేశ్వర్, దీపిక, పారా లీగల్ వలంటీర్లు పల్లెమోని యాదయ్య, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణాల పునరుద్ధరణ



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రవినాయక్

- కలెక్టర్ రవినాయక్
- వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లతో సమీక్ష

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పంటల రుణమాఫీ పొందిన రైతులందరికీ ఈ నెలాఖరు వరకు రుణాలను పునరుద్ధరించాలని కలెక్టర్ జి.రవినాయక్ ఆదేశించారు. గురువారం కొత్త కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వ్యవసాయ, బ్యాంకు నియంత్రణ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ, రెన్యూవల్ రుణాల వివరాలను ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. ఈనెల 21నాటికి రూ.1.20లక్షల వరకు రుణాలు ఉన్న రైతులకు రుణమాఫీ చేశామన్నారు. ఈపాటికే 48వేల మంది రైతుల ఖాతాల్లో రూ.295 కోట్లు జమ అయ్యాయని వివరించారు. రూ.202 కోట్ల రుణాలను తిరిగి రెన్యూవల్ రూపంలో ఇచ్చామన్నారు. స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ యాదయ్య, డీఏఓ వెంకటేష్, ఎల్‌డీఎం భాస్కర్, ఎస్‌బీఐ ఆర్‌ఎం అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

15 రోజుల్లో పాఠశాలలను ప్రారంభించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మన ఊరు– మన బడి కింద ప్రారంభానికి సిద్ధంగా ఉన్న అన్ని పాఠశాలలను 15 రోజులలో ప్రారంభించాలని కలెక్టర్ జి.రవినాయక్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో మాట్లాడుతూ అనుమతించిన అన్ని పనులను పూర్తి చేయాలని, అసంపూర్తిగా ఉన్న పనులు త్వరగా పూర్తిచేసి వచ్చే నెలలోగా అన్ని పాఠశాలలను ప్రారంభించాలని ఆదేశించారు. రెండో దశ కార్యక్రమం త్వరలో ప్రారంభం కానున్న దృష్ట్యా గ్రౌండింగ్ కానీ పాఠశాలల్లో కచ్చితంగా గ్రౌండింగ్ అయ్యేలా సంబంధిత ఎంఈఓలు, ఏఈలు ప్రయత్నించాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న ఈజీఎస్ పనులను త్వరగా పూర్తి చేసేందుకు డీఆర్డీఓ, సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో సమన్వయం చేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. సమీక్షలో ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ యాదయ్య, డీఈఓ రవీందర్, ప్లానింగ్ కో ఆర్డినేటర్ గోవర్ధన్‌గౌడ్, శ్రీనివాస్, ఏఈలు, డీఈలు, ఎంఈఓలు, తదితరులు పాల్గొన్నారు.



మురికికూపంగా మారిన శేషాద్రినగర్‌లోని 12వ వీధిలో ఓపెన్ ప్లాటు



లక్ష్మీనగర్‌కాలనీలోని ఓపెన్ ప్లాటు వద్ద ఇదీ పరిస్థితి..



భాగ్యనగర్‌కాలనీలోని ఓపెన్ ప్లాటులో చేరిన మురుగు



శేషాద్రినగర్ కమాన్ సమీపంలోని ఓపెన్ ప్లాటులో ఇలా..



విఘ్నేశ్వరకాలనీలోని ఒకటో వీధిలో మురుగుమయం

అమ్మో.. దోమ!



ముందుకు కదలని మురుగు..!
మినీ ట్యాంక్‌బండ్ ప్రధాన ద్వారం నుంచి శిల్పారామం వెళ్లే మార్గంలో నిండిన ఓపెన్ నాలా



దోమలకు నిలయం.. ఓపెన్ ప్లాట్లు, నాలాలు

- అసలే వర్షాకాలం.. ఆపై అపరిశుభ్రత
- జిల్లాకేంద్రంలో ఎక్కడికక్కడే చెత్తాచెదారం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని ఓపెన్ ప్లాట్లు, నాలాలు దోమలకు నిలయంగా మారాయి. అసలే వర్షాకాలం.. ఆపై అపరిశుభ్రత వాతావరణం మధ్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కొందరు డెంగీ, విష జ్వరాల బారిన పడుతున్నారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ పరిధిలోని 49 వార్డుల్లో 2,88,026 మంది జనాభా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలతో ఓపెన్ ప్లాట్లు కాస్తా మురికి కుంటలుగా మారాయి. అంతటా ఓపెన్ నాలాలు ఉండటం.. అవి నిండి సమీపంలోని ఓపెన్ ప్లాట్లలోకి చేరుతున్నాయి. అలాగే చుట్టుపక్కలవారు వాటిలోనే చెత్తాచెదారం యథేచ్ఛగా వేస్తున్నారు. దీంతో పాటు పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి దోమలకు, పందులకు, పాములకు ఆవాసంగా మారాయి. గురువారం 'సాక్షి' పరిశీలనలో ఈ విషయాలు వెలుగు చూశాయి. ఒక వైపు మున్సిపల్ అధికారులు ఆయా వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొంటున్నా.. ఎక్కడా కనిపించకపోవడం గమనార్హం. జిల్లాకేంద్రంలోని లక్ష్మీనగర్‌కాలనీ, సుబ్రమణ్య కాలనీ, భాగ్యనగర్‌కాలనీ, మర్లు, పాలకొండ, క్రిస్టియన్‌పల్లి, పాతపాలమూరు, గచ్చిబౌలి, రామయ్యబౌలి, శివశక్తినగర్, బండ్లగేరి, బండమీదిపల్లి, కుమ్మరివాడితో పాటు మిగిలిన ఏడు విలీన గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది.

దోమల బెడద తీవ్రంగా ఉంది



మా ప్రాంతంలో దోమలు, పాముల బెడద తీవ్రంగా ఉంది. ఓపెన్ ప్లాట్ల యజమానులు సరిగా పట్టించుకోకపోవడంతో అవి మురికికూపాలుగా మారాయి. ముఖ్యంగా డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. కిటికీల నుంచి చిన్న దోమలు గుంపులు గుంపులుగా ఇంటి లోపలికి వస్తున్నాయి. బయట పరిసరాలు మొత్తం అపరిశుభ్రంగా ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. మోరీలు నిర్మిస్తామన్న అధికారులు, నాయకుల హామీలు నీటిమూటలుగా మిగిలాయి. కనీసం ఈ వర్షాకాలం సీజన్‌లోనైనా తరచూ బ్లీచింగ్ పౌడర్ చల్లి, ఫాగింగ్ చేపడితే బాగుంటుంది. – బి.శ్రీదేవి, శేషాద్రినగర్, మహబూబ్‌నగర్

అన్నీ అపరిశుభ్రంగా మారాయి



మా వీధిలోని ఓపెన్ ప్లాటు మొత్తం చెత్తాచెదారంతో నిండిపోయింది. దానిచుట్టూ ఉన్న ఓపెన్ నాలాలు అపరిశుభ్రంగా మారాయి. ముఖ్యంగా దోమలకు ఆవాసంగా తయారైంది. అసలే వర్షాకాలం.. ఆపై సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. మా కాంపౌండ్‌లోని ఐదు కుటుంబాల్లో సుమారు పది మంది చిన్నపిల్లలు ఉంటారు. బయటకు పంపించాలంటేనే భయమేస్తుంది. ఎక్కడ డెంగీ, విష జ్వరాలు సోకుతాయోనని ఆందోళనగా ఉంది. మున్సిపల్ అధికారులు స్పందించి తరచూ ఫాగింగ్‌తో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. ఎప్పటికప్పుడు మోరీలను శుభ్రం చేయాలి. – కవిత, ప్రైవేట్ ఉపాధ్యాయిని, లక్ష్మీనగర్‌కాలనీ, మహబూబ్‌నగర్



క్లుప్తంగా

కోనేరులో మునిగి వ్యక్తి మృతి

జడ్చర్ల: జడ్చర్ల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని కోనేరులో పడి ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. వెంకటేశ్వర కాలనీకి చెందిన నర్సింహులు, (42) సమీప గణేష్ మండపం దగ్గర భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేసి చేతులు శుభ్రం చేసుకునేందుకు పక్కనే ఉన్న కోనేరులోకి దిగాడు. చేతులు కడుక్కుంటుండగా మెట్లపై పాకర ఉండడంతో కాలు జారీ ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. ఆ సమయంలో ఎవరు గమనించక పోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. అతనికి భార్య గంగ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని సీఐ రమేశ్ బాబు తెలిపారు.

మహిళా అనుమానాస్పద మృతి

రాజాపూర్: మండలంలోని చెన్నవెల్లిలో ఓ మహిళ అనుమాదస్పదంగా మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి వివరాల ప్రకారం జడ్చర్ల పాతబజారుకు చెందిన పిట్టల జయమ్మ(36)తో 18 సంవత్సరాల కిందట చెన్నవెల్లి గ్రామానికి చెందిన లవయ్యతో వివాహం అయ్యింది. భార్యాభర్తల మధ్య తరుచుగా గొడవలు జరుగుతుండేవి. భార్య చనిపోయిందని ఇంటి ముందు భర్త కన్నీటిపర్యంతం అయ్యాడు. కుటుంబసభ్యులు, చుట్టుపక్కల వారు గమనించి ఇంట్లోకి వెళ్లిచూడగా జయమ్మ విగత జీవిగా కనిపించింది. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అల్లుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతురాలి తండ్రి కొడుగంటి పెంటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

చెరువులో బోరు మోటారు తీసేందుకు వెళ్లి..

ఖిల్లాఘనపురం: ప్రమాదవశాత్తుతో చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీహరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కమాలొద్దీన్‌పూర్‌కి చెందిన కమ్ము నర్సింహులు(38) గ్రామంలోని నాగసముద్రం చెరవులో కృష్ణయ్యకు చెందిన కాలిపోయిన బోరు మోటారు బయటకు తీసేందుకు వెళ్లాడు. కాలిపోయిన మోటార్ తీసే క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. మృతుని భార్య చిట్టెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని చెరువు నుంచి వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

హన్వాడ: భార్య పుట్టింటికి వెళ్లిందని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మండలంలోని ఇబ్రహీంబాద్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ రవినాయక్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన బోవి మంగమ్మ భర్త బాలయ్య (38)తో గొడవపడి తల్లిగారి ఇంటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన బాలయ్య ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాలయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లి నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

బాలిక ఆత్మహత్య

మిడ్జిల్: మండలంలోని రాణిపేటలో ఓ బాలిక పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. ఆయన కథనం మేరకు.. బాలికకు చిన్నాన్న వరుస అయ్యే వ్యక్తి ప్రేమిస్తున్నానంటూ వేధించడంతో బుధవారం రాత్రి ఇంట్లో పురుగుమందు తాగింది. గురువారం కుటుంబ సభ్యులు చూసే సరికి మృతిచెంది కనిపించింది. తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం సాయంత్రం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి మృతిపై కేసు నమోదు

అడ్డాకుల: మూసాపేటలో నివసించే రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి రేమద్దుల గంగపురి(55) మృతిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఇంట్లో చనిపోయి ఉన్న గంగపూరి మృతదేహాన్ని బంధువులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా జిల్లా ఆస్పత్రికి తరలించారు. విదేశాల్లో ఉన్న కుమారుడు రావడంతో గంగపురి భార్య లత గురువారం మూసాపేట ఠాణాలో ఫిర్యాదు చేసింది. కేసునమోదు చేసిన పోలీసులు మార్చురీలో ఉన్న మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు.

మట్కారాయుళ్ల అరెస్ట్

మక్తల్: ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతున్న ముగ్గురిని గురువారం అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ రాంలాల్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. పట్టణానికి చెందిన తాజ్, చాంద్‌పాషా, కుర్వ నర్సప్ప కళ్యాన్ అనే ఆన్‌లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వారితో పాటు మరికొందరితో మట్కా ఆడిస్తున్నారని.. వారికి వచ్చిన డబ్బులో 10 శాతం కమీషన్ తీసుకుంటున్నట్లు వివరించారు. సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ గేమ్, జూదం, మట్కా, క్రికెట్ బెట్టింగ్ వంటి ఆటలు ఆడి మోసపోవద్దని సూచించారు. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్ఐ పర్వతాలు పాల్గొన్నారు.

క్రీడాకారుల కల సాకారం

- చివరి దశలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం పనులు
- రూ.7.79 కోట్లతో నిర్మాణం
- ఉడెన్ కోర్టుల ఏర్పాటు



ఉడ్‌తో ఏర్పాటు చేసిన కోర్టు



నిర్మాణంలో ఉన్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం పనులు తుది దశకు చేరాయి. రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషితో ఉమ్మడి జిల్లాకే తలమానికంగా స్టేడియం నిర్మాణం జరుగుతోంది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న క్రీడాకారుల కల త్వరలో నెరవేరబోతుంది. అన్ని హంగులు, వసతులతో నిర్మిస్తున్న స్టేడియం త్వరలో ప్రారంభం కానుంది.

తుది దశలో పనులు..

రూ.7.79 కోట్లతో అధునాతన సౌకర్యాలతో నిర్మాణం జరుగుతోంది. స్టేడియం నిర్మాణంపై మంత్రి ఎప్పటికప్పుడు అధికారులకు దిశానిర్దేశం చేస్తూ పనుల వేగవంతం కోసం తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే గ్రౌండ్, రెండో ఫ్లోర్‌లో పెవీలియన్, ఇతర గదుల పనులు పూర్తి చేశారు. టేబుల్ టెన్నిస్ హాల్, బాక్సింగ్ హాల్‌తో పాటు స్టోర్ రూం, క్రీడాకారుల గదులను ఏర్పాటు చేశారు. పోటీలను తిలకించడానికి రెండు వైపుల గ్యాలరీలు ఏర్పాటు చేసి సీట్లు అమర్చారు. ఉడెన్ బాస్కెట్‌బాల్ కోర్టు, మూడు షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు ఏర్పాటు చేశారు. స్టేడియం బయటి గోడలపై అంతర్జాతీయ క్రీడాకారుల చిత్రాలను ఏర్పాటు చేయనున్నారు.

మెరుగైన వసతులు..

మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు అన్నిరకాల వసతులు కల్పిస్తున్నారు. నిర్మాణం పూర్తయితే వెయిట్ లిఫ్టింగ్, జూడో, బాక్సింగ్, కబడ్డీతో పాటు ఇతర ఇండోర్ క్రీడలు ఆడే అవకాశం ఉంది. అదేవిధంగా షటిల్ బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్, టెన్నికాయిట్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడాకారులు ప్రాక్టీస్ చేసుకోవడానికి ఆస్కారం ఉంది. భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయి ఇండోర్ క్రీడాపోటీలకు మహబూబ్‌నగర్‌లోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం వేదికగా మారే అవకాశం ఉంది.

త్వరలో ప్రారంభం..



మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషితో జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ఏర్పాటవుతుంది. త్వరలోనే ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. స్టేడియంలో క్రీడాకారులకు అన్నిరకాల వసతులు కల్పిస్తున్నాం. నిష్ణాతులైన కోచ్‌లు వస్తారు. అంతర్జాతీయస్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దవచ్చు.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్ఓ, మహబూబ్‌నగర్

మార్కెట్ యార్డులో అగ్ని ప్రమాదం



గోదం గోడలు పగలగొట్టి మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

- గోదాంలో నిల్వ ఉంచిన వరిధాన్యం బస్తాలు దగ్ధం
- ఫైర్‌సిబ్బంది, పోలీసుల చొరవతో తప్పిన భారీ నష్టం

నవాబుపేట: రైతులతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి మిల్లర్లకు అందించింది. కాగా మిల్లర్లు మార్కెట్ యార్డులో గోదాంలో వాటిని భద్రపరిచారు. కాగా ఆ ధాన్యం నిల్వ ఉంచిన గోదాంలో ఒక్కసారిగా మంటలు రేగడంతో అందరూ ఉలిక్కిపడ్డారు. వెంటనే తేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో స్థానిక పోలీసుల సాయంతో గోదం గోడలు పగలకొట్టి ధాన్యం ఎక్కువగా అగ్నికి ఆహుతి కాకుండా ఆపగలిగారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులోని ధాన్యం గోదాం నుంచి పొగలు వచ్చాయి. దీంతో అక్కడ ఉన్న వ్యాపారులు చూసి పోలీసులకు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే వారు అప్రమత్తం కావటంతో 12 వేల బస్తాలు ఉంచిన గోదాంను పెద్ద నష్టం జరగకుండా కాపాడారు. ప్రమాదంలో దాదాపుగా 500 బస్తాల వరకు ధాన్యం అగ్నికి ఆహుతి అయ్యింది. నిత్యం అక్కడే ఉండే మార్కెట్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటంతోనే ధాన్యం అగ్నికి ఆహుతి అయ్యిందని, అక్కడ ఉన్న రైతులు వాపోయారు. కాగా బుధవారం మార్కెట్ యార్డులోని ధాన్యం నిల్వ ఉంచిన గోదం పక్కనే చెత్తను చేర్చి మంట పెట్టినట్లు తెలుస్తుంది. ఆ మంటల కారణంగా ధాన్యం గోదాంలోకి మంటలు వ్యాపించాయని రైతులు ఆరోపించారు. నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన మార్కెట్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటంతోనే ఈ ప్రమాదం జరిగిందని రైతులు వాపోతున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం..

మార్కెట్ అధికారులు సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండటంతోనే ప్రమాదం జరిగిందని చెత్తను ధాన్యం గోదం పక్కన వేసి మంటలు వేస్తే అధికారులు ప్రేక్షకపాత్ర పోషించి ధాన్యం దగ్ధానికి కారణమయ్యారు. మార్కెట్‌లో సీజన్ లేకున్నా.. అధికారుల పర్యవేక్షణ లేకపోవటం చాలా దారుణం. ఈ విషయంలో నిర్లక్ష్యంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మయ్య, మార్కెట్ చైర్మన్ నవాబుపేట

ఇంట్లోకి దూసుకెళ్లిన టిప్పర్

- వృద్ధురాలికి గాయాలు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి



మక్తల్‌లో ఇంట్లోకి దూసుకెళ్లిన బూడిద టిప్పర్

మక్తల్: బూడిద లోడ్‌తో ఉన్న టిప్పర్ కర్ణాటక నుంచి హైదరాబాద్ వెళ్తుంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి 11 గంటలకు మక్తల్ నల్లజానమ్మ దేవాలయం మలుపు వద్దకు రాగానే డ్రైవర్ అజాగ్రత్తతో పక్కనే ఉన్న ఇంట్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. మక్తల్‌కు చెందిన ఇంటి యాజమానురాలు పద్మమ్మ స్వల్పంగా గాయపడింది. ఈ విషయం తెలుసుకున్న మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి రాత్రి అక్కడికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వృద్ధురాలిని మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బూడిద టిప్పర్ ఇంట్లోకి తీసుకెళ్లడంతో రోడ్డుకు ఇరు వైపుల ఉన్న స్తంభాలు విరిగిపోయి, ఇట్లోంని వడ్రంగి పరికరాలు విరిగిపోయి, ఇల్లు మొత్తం బూడిదమయమైంది. బూడిద లారీలకు అనుమతి ఎవరు ఇచ్చారని పోలీసులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పర్వతాలు తెలియజేశారు. టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత

చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తి స్టేజీ వద్ద రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని బుధవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. అమరచింత మండలానికి 13 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా.. పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ ఐ శేఖర్ తెలిపారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఐదురోజుల జైలు

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన ఓ వ్యక్తికి జరిమానాతోపాటు ఐదురోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఆనంద్ చారిని గురువారం కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి డి.నిర్మల అతడికి రూ.2,500 జరిమానాతోపాటు ఐదురోజుల జైలుశిక్ష విధించారు.

ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తాం



స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ ఆర్ఎంకు ప్రయాణికుల నుంచి వచ్చిన ఫిర్యాదులు, సూచనలను పరిశీలించి పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్ఎం కార్యాలయంలో గురువారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహించి ప్రయాణికుల నుంచి ఆర్టీసీకి సంబంధించిన ఫిర్యాదులు తీసుకున్నారు. మహబూబ్‌నగర్ బైపాస్ మీదుగా దివిటిపల్లి నుంచి భూత్పూర్ వరకు పల్లె వెలుగు బస్సులు నడపాలని, మహబూబ్‌నగర్ నుంచి నవాబ్‌పేట-కొత్తపల్లి నైట్‌హాల్ట్ బస్సును పునరుద్ధరించాలని, రాత్రి 7 గంటల తర్వాత షాద్‌నగర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు బస్సు నడపాలని చాలా మంది కోరారు. నాగర్‌కర్నూల్ నుంచి పల్లెవెలుగు బస్సును రేవల్లి వరకు పొడిగించాలని, నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాల వద్ద రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని, మహబూబ్‌నగర్ పట్టణంలో సిటీ బస్సులు నడపాలని, అచ్చంపేట-లింగాల నైట్ హాల్ట్ సర్వీసు, సాయంత్రం 6 గంటల తర్వాత ఆత్మకూర్ మీదుగా వడ్డేమాన్ నుంచి మహబూబ్‌నగర్ వరకు బస్సు నడపాలని కోరారు.

ముందస్తు టికెట్ బుకింగ్‌కు 10శాతం రాయితీ

స్టేషన్ మహబూబ్‌నగర్: దసరా పండుగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు ముందస్తు టికెట్ బుకింగ్ చేసుకునే వారికి 10 శాతం రాయితీ ఇవ్వాలని టీఎస్‌ఆర్టీసీ నిర్ణయించినట్లు రీజినల్ మేనేజర్ శ్రీదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 15 నుంచి 29 తేదీల మధ్యలో ప్రయాణానికి రానుపోను ఒకేసారి టికెట్ బుకింగ్ చేసుకుంటే తిరుగు ప్రయాణంపై 10 శాతం డిస్కౌంట్ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా తేదీల్లో ప్రయాణానికి ఈనెల 30 వరకు ముందస్తు రిజర్వేషన్ చేసుకునే ప్రయాణికులకు మాత్రమే 10 శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు. రిజర్వేషన్ సదుపాయమున్న అన్ని సర్వీసుల్లో రాయితీ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఈ సదుపాయాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని, ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ వివరాల కోసం సంస్థ అధికారిక వెబ్‌సైట్ tsrtconline.in చూసుకోవాలని కోరారు.

బాత్‌రూంలో జారిపడి బాలింత మృతి

నారాయణపేట: డెలవరి కోసం ఆస్పత్రికి వచ్చిన బాలింత బాత్‌రూంలో జారిపడి మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. మక్తల్ మండలం మాద్వార్‌కు చెందిన మురళికి ఏడేళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రానికి చెందిన స్వాతితో వివాహమైంది. చాలా కాలం తర్వాత గర్భం దాల్చిన భార్యను కాన్పు కోసం నారాయణపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి సోమవారం తీసుకొచ్చారు. మంగళవారం సిజేరిన్ చేయగా, ఆడబిడ్డకు జన్మనిచ్చింది. పర్యవేక్షణ నిమిత్తం ఆస్పత్రిలోనే ఉండగా, గురువారం ఉదయం బాత్‌రూంకు ఎవరి సహాయం లేకుండా వెళ్లిన ఆమె.. ప్రమాదవశాత్తు జారి పడింది. అటువైపు వెళ్లిన వారు గమనించి కుటుంబ సభ్యులకు తెలపగా ఆమెను ఎత్తుకుని బెడ్ వరకు తీసుకొచ్చి వైద్యులను సంప్రదించారు. తీవ్ర రక్తస్రావం వల్ల పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. అంబులెన్స్‌లో తరలిస్తుండగా, మార్గమధ్యలో ఆమె మృతి చెందింది. ఆస్పత్రి వర్గాల నిర్లక్ష్యం వల్లనే ఇలా జరిగిందని కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద మనుషులు వారిని సముదాయించి పంపించారు.

రైతులకు సాగునీటి వసతి కల్పించాలి

నవాబుపేట: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్ పనులను త్వరగా పూర్తిచేసి, రైతులకు సాగునీటి వసతి కల్పించాలని బీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం సీనియర్ సిటిజన్ ఫోరం, బీకేఎస్ ఆధ్వర్యంలో రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బీకేఎస్ జెండాను ఎగరవేశారు. అనంతరం రైతుల సమస్యలపై ఆరా తీశారు. అధునాతన పద్ధతిలో పంటల సాగు, సేంద్రియ ఎరువుల వాడకం అవగాహన కల్పించారు. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఏతఃకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణయ్య, మహేష్, నర్సింహులు, సత్యనారాయణగౌడ్, వేణునాథం, శివస్వామి, అశోక్ పాల్గొన్నారు.

భవిష్యత్ ఫుడ్ ప్రాసెసింగ్‌దే..



మాట్లాడుతున్న శాస్త్రవేత్త జ్యోత్స్న

బిజినేపల్లి: భవిష్యత్‌లో ఫుడ్ ప్రాసెసింగ్‌కే అధిక ప్రాధాన్యం ఉంటుందని పాలెం కేవీకే గృహవిజ్ఞాన శాస్త్రవేత్త జ్యోత్స్న అన్నారు. గురువారం పాలెం కేవీకే, డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు మూడురోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ వ్యవసాయంలో ప్రత్యక్షంగా ఆహార ఉత్పత్తులను విక్రయించడం కంటే.. ప్రాసెసింగ్ చేసి ఆకర్షణీయంగా మార్కెట్‌కు తరలిస్తే అధిక లాభాలు ఉంటాయన్నారు. ఆహార అనుబంధ సంస్థల స్థాపనకు కావాల్సిన ప్రణాళిక, వసతులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మహిళలు ఒక సమూహంగా ఏర్పడి చిన్న చిన్న వ్యాపారాలను స్థాపించాలని తెలిపారు. తద్వారా కుటుంబ పోషణ, ఆర్థిక స్థిరత్వం సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి, డీఆర్డీఏ ఏపీఓ శ్రీనివాస్, ఏపీఎం సుధాకర్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన కేంద్ర బృందం



సిబ్బందితో సమావేశమైన కేంద్రం బృందం సభ్యులు

గట్టు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం కేంద్ర బృందం (ఎన్‌కాస్) సభ్యులు డా. రిజికుమార్, జ్ఞానరంజన్‌కుమార్ సందర్శించారు. పీహెచ్‌సీతో పాటు ఆయా సబ్‌సెంటర్ల పరిధిలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న మందులు, ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో వైద్యసిబ్బందితో సమావేశమై ప్రసవాలు, స్వచ్ఛత, రోజువారీగా రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి స్రవంతి, వైద్యాధికారులు హరీశ్, రాజు, ఎన్‌కాస్ టీం మేనేజర్ రాజ్‌కుమార్, సీహెచ్‌ఓ ఊస్సేని, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గడ్డి క్షేత్రాల నిర్వహణపై అవగాహన



అటవీ సిబ్బందికి సూచనలిస్తున్న రేంజ్ అధికారి ఆదిత్య

మన్ననూర్: అమ్రాబాద్ డివిజన్ మద్దిమడుగు రేంజ్ పరిధి సోమచెల్కలో గడ్డి క్షేత్రాల (గ్రాస్ ల్యాండ్) నిర్వహణపై రేంజ్ అధికారి ఆదిత్య సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. అచ్చంపేట డివిజన్‌కు చెందిన అమ్రాబాద్, మన్ననూర్, దోమలపెంట, లింగాల, అచ్చంపేట రేంజ్‌ల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడ్డి క్షేత్రాల నిర్వహణ, ప్రాధాన్యాన్ని వివరించారు. గడ్డి మైదానాలు సమృద్ధిగా ఉంటే శాఖాహార జంతువులు, అలాగే పెద్దపులుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. నల్లమల, అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం మూడురకాల గడ్డి క్షేత్రాలను పెంచేందుకు అనువుగా ఉందని వివరించారు. గడ్డి క్షేత్రాలను ఆశించినస్థాయిలో పెంచితే వన్యప్రాణుల మనుగడకు కొదవ ఉండదని తెలిపారు. గతంలో ఈ ప్రాంతంలోకి ఇతర ప్రాంతాల వారు చొరబడి వన్యప్రాణులను వేటాడారని.. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో రేంజ్ అధికారులు ఈశ్వర్, శరత్‌చంద్ర, డీఆర్ఓలు, ఎఫ్ఎస్ఓలు, బీట్ అధికారులు, వాచర్లు పాల్గొన్నారు.

గంజాయి కలకలం

- అడ్డాకులలో ఇద్దరిని పట్టుకున్న పోలీసులు
- అరకిలో గంజాయి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

అడ్డాకుల: గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు పట్టుకోవడం కలకలం రేపింది. ఇరువురి నుంచి సుమారు అరకిలో వరకు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ మాధవరెడ్డి వివరాల ప్రకారం.. పంజాబ్ రాష్ట్రానికి చెందిన రవిసింగ్ వనపర్తి జిల్లా కొత్తకోటలో ఉంటూ హార్వేస్టర్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఇతడికి అడ్డాకులకు చెందిన మునగాల నరేష్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి కొన్నాళ్ల నుంచి గుట్టుచప్పుడు కాకుండా అడ్డాకుల, కొత్తకోటలో గంజాయిని విక్రయిస్తున్నారు. పక్కా సమాచారం అందుకున్న సీఐ రామకృష్ణ.. ఎస్ఐ మాధవరెడ్డితో కలిసి గురువారం మండల కేంద్రం సమీపంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరిని ఠాణాకు తరలించారు. వారి నుంచి సుమారు 40 గంజాయి ప్యాకెట్లు లభించినట్లు ఎస్ఐ తెలిపారు. వాటిలో సుమారు అరకిలో వరకు గంజాయి ఉన్నట్లు చెప్పారు. దీన్ని విలువ రూ.25వేల వరకు ఉంటుందన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా వీరిద్దరితోపాటు ఇంకా ఎవరెవరు ఇందులో ఉన్నారన్న దానిపై పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

ASTROLOGY

■ కేరళ మహంకాళి మాంత్రిక జ్యోతిష్యం. 35 సంగల నుండి స్థిరంగా ఉన్నారు. మీ ఎటువంటి కష్టతర సమస్యలకైనా 5 రోజుల్లో పరిష్కారం. స్త్రీ/పురుష వశీకరణ. 100% గ్యారంటీ. HYD. 6304163239.

NAME CHANGE

■ I SEKHAR S/o P. PENTAIAH Govt. employee, Shall hence forth be known as PALLEMONI SEKHAR S/o P. PENTAIAH for the purpose of Correction of School records.

WANTED

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573833520, 9059633520.

■ స్టార్ హోమ్‌కేర్ HYD వృద్ధులకు, పేషేంట్లకు సేవ చేయుటకు, బేబీకేర్ ఇంటి/వంట పనికి స్త్రీ/పు కావలెను. జీతం : 16,000/- నుండి 35,000/- రూం + భోజనం ఉచితం. ఫోన్: 84904 82881

■ త్రివేణి హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులకు, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను.ఉచిత వసతి+భోజనం. జీతం :18K. Ph : 9848571888/ 9640400073

■ Louis Philippe Readymade ShowRoom MBNRలో పనిచేయుటకు సేల్స్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, స్టోర్ ఇంఛార్జ్, ఆఫీస్ బాయ్స్ కావలెను. సెల్:9493159185.

■ రేమండ్ షోరూమ్, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, వనపర్తిలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్, స్టోర్ ఇంఛార్జ్, సేల్స్ ఇంఛార్జ్ కావలెను. సెల్.9492801999, 08543796686.

■ మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల ఫార్మా కంపెనీలో సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం 13000 వసతి భోజనం ఉచితం. ఈఎస్ఐ, ఈపీఎఫ్, అదనం. సంప్రదించండి. ఫోన్ : 6300681014

■ గాయత్రి గ్రూపు, VJA, HYD శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధుల సేవకు వంట/ఇంటిపని, బేబీకేర్ వర్కర్స్ కావలెను. జీ. 15 to 22 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు ✆ 62812 08600, 6281208656

సాక్షి ద్వారా మీ ఆత్మీయుల పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ. 500/- మాత్రమే HAPPY BIRTHDAY

గమనిక ... - సాక్షి మేనేజర్

సాక్షి భవిత విద్యార్థుల కోసం